'బీజేపీ రక్షకుడు రాహుల్ గాంధీ'

నాగోలు: బీజేపీని రక్షించడానికే కాంగ్రెస్ పని చేస్తోందనే విషయం మరోసారి స్పష్టమైంది. రాహుల్ గాంధీ రాజకీయాల్లో ఉన్నన్ని రోజులు బీజేపీ గెలుస్తూనే ఉంటుందని ఢిల్లీలో బీజేపీ గెలుపు కోసం తీవ్రంగా శ్రమించిన రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీకి మోదీ ధన్యవాదాలు తెలపాలని రెడ్కో మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై.సతీష్‌రెడ్డి ఓ ప్రకటనలో వెల్లడించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు కూడా తమ విజయం కోసం పని చేయడం లేదని కేవలం ప్రాంతీయ పార్టీలను దెబ్బతీయడానికే పని చేస్తోందన్నారు. తెలంగాణ ప్రజలను రాహుల్ గాంధీ కుటుంబం మోసం చేసింది. ఎన్నికలప్పుడు రాష్ట్రానికి వచ్చిన రాహుల్, ప్రియాంక గాంధీ హామీలిచ్చి ఇప్పుడు వాటిని విస్మరించారన్నారు.

ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా



పనులకు శంకుస్థాపన చేస్తున్న వంగ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఆయా కాలనీల్లో నెలకున్న సమస్యలన్నీ దశలవారీగా పరిష్కరిస్తానని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. అంబేడ్కర్‌వాడ కాలనీలో రూ. 9 లక్షలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రమ్యభారతి, సర్కిల్ ఏఈ సురేష్, నాయకులు శ్రీనివాసరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, అంజి, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు సంజన్న, రాజు, నాగరాజు, దేవరాజు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న దయానంద్‌గుప్తా

నాగోలు: సీఎంఆర్‌ఎఫ్ పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ భవానీనగర్‌కు చెందిన బచ్చురాజుకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.7 లక్షల ఎల్‌ఓసీ చెక్కును శనివారం ఆయన బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా దయానంద్‌గుప్తా మాట్లాడుతూ.. పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదన్నారు.

ఉచిత వివాహాలు చేయడం అభినందనీయం

నాగోలు: ప్రముఖ సంఘ సేవకులు తెలంగాణ సెంట్రల్ సెన్సార్ బోర్డు మెంబర్ డా. మొగుళ్లపల్లి ఉపేందర్ ఉచితంగా వివాహాలు చేయడం అభినందనీయమని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. శనివారం మొగుళ్లపల్లి యువసేన ఆధ్వర్యంలో 218వ ఉచిత వివాహ వేడుక కొత్తపేట నాగేశ్వర్‌రావుకాలనీలోని శ్రీ ధ్యానాంజనేయ స్వామి, సాయిబాబా దేవాలయంలో నిర్వహించారు. ఈ వేడుకకు హాజరైన ఉప్పల శ్రీనివాస్‌గుప్తా నూతన వధూవరులను ఆశీర్వదించారు.

నియామకం



నియామక పత్రం అందుకుంటున్న గోవింద్

దిల్‌సుఖ్‌నగర్: రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేటకు చెందిన ముడావత్ గోవింద్‌ను నియమించారు. శనివారం రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి ఆయన నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తున్నారన్నారు. పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పార్టీ అభివృద్ధి–సంక్షేమమే అజెండాగా పని చేస్తుందన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.11, వంకాయ రూ.23, బెండ రూ.38, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.09, క్యారెట్ రూ.15, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.29, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.19, సొరకాయ రూ09, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.35, చామగడ్డ రూ.28, మునగ రూ.70, చిలుకడ దుంప రూ.65.

మినీ ట్యాంక్‌బండ్

అభివృద్ధి జరిగేనా?



చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలు



ధ్వంసమైన ఫ్లోరింగ్ టైల్స్

- మురికి కూపంలా సరూర్‌నగర్ చెరువు
- సుందరీకరించాలంటున్న సందర్శకులు
- విస్మరిస్తున్న అధికారులు

చైతన్యపురి: సరూర్‌నగర్ చెరువు నానాటికి మురికి కూపంలా మారుతుంది. మురుగు, వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధంగా మారుతోంది. కట్టపై నుంచి వెళ్తేనే ఘాటైన వాసనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని బాటసారులు వాపోతున్నారు. మురుగు నీరు చెరువులో కల్వకుండా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఈ దుస్థితికి చేరింది స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పర్యాటక ప్రాంతంగా తీర్చి దిద్దాల్సిన మినీ ట్యాంక్ బండ్ ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతో దుర్గంధానికి నిలయంగా మారుతోంది. దీనికి తోడు రోజురోజుకు చెరువు చుట్టూ స్థలం ఆక్రమణలకు గురి కావటంతో కుంచించుకుపోతోంది.

బోటింగ్‌కు తగ్గిన ఆదరణ

పాత సరూర్‌నగర్ మండలంలోని గ్రామాల నుంచి, అక్కడి చెరువుల నుంచి మురుగునీరు సరూర్‌నగర్ చెరువులో కలుస్తుండటంతో మురికి కూపంలా మారుతోంది. పరిసర కాలనీల వాసులు వ్యర్థాలు చెరువులోనే పడేయటంతో మరింత కంపు కొడుతోంది. సీవరేజీ ప్లాంట్లను ఏర్పాటు చేసినప్పటికి సక్రమంగా పనిచేయకపోవటంతో చెరువు మురుగు నీటితో నిండిపోయింది. చెరువు అభివృద్ధిలో భాగంగా ఇందిరా ప్రియదర్శిని పార్కును ఏర్పాటు చేసి బోటింగ్ సౌకర్యం కల్పించారు. దుర్వాసన వస్తుండటంతో బోటింగ్‌కు ఆదరణ లేకుండా పోయింది.

ధ్వంసమైన ఫ్లోరింగ్

చెరువు కట్టపై ఉన్న ఫ్లోరింగ్ ధ్వంసం కాగా టైల్స్ పగిలిపోయి గుంతలమయంగా మారింది. సందర్శకులు నడవడానికి కూడా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అలాగే చెరువు కట్ట కుంగిపోవటంతో ఇక్కడ ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు ఒరిగిపోతున్నాయి. చెరువు చుట్టూ రక్షణగా ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్ సైతం చాలా ప్రాంతాల్లో ఊడిపోయి ప్రమాదకరంగా మారాయి. సరూర్‌నగర్ చెరువు సమీప కాలనీల ప్రజలు సాయంత్రం వేళల్లో పిల్లలతో కలిసి సేదతీరేందుకు వస్తుంటారు. చెరువులోంచి దుర్వాసన వస్తుండటంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి, చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సందర్శకులు, స్థానికులు కోరుతున్నారు.

రూ.5.5 కోట్లతో అభివృద్ధికి ప్రతిపాదనలు



సరూర్‌నగర్ చెరువు కట్ట అభివృద్ధికి రూ.5.5 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి గతేడాది నవంబర్‌లో ప్రతిపాదనలు పంపించారు. అనుమతులు రాకపోవటంతో పనులు ప్రారంభం కాలేదు. చెరువును అభివృద్ధి చేయాలని పలుమార్లు జీహెచ్‌ఎంసీ అధికారులను కోరాం. త్వరలో పనులు ప్రారంభం అవుతాయని భావిస్తున్నాం.

– బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్, గడ్డిఅన్నారం డివిజన్

వీరన్నగుట్టను పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దుతా

మన్సూరాబాద్: రామలింగేశ్వరస్వామి దేవాలయ ప్రాంతమైన వీరన్నగుట్టను పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దుతానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. రానున్న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం వీరన్నగుట్ట క్షేత్రాన్ని ఆయన కాలనీవాసులతో కలిసి పరిశీలించి ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. శివరాత్రి పర్వదినం రోజు వేల సంఖ్యలో వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.



మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

చదువుతోనే సమాజంలో గుర్తింపు



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

మలక్‌పేట: మలక్‌పేట నెహ్రూ మెమోరియల్ హైస్కూల్ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మలక్‌పేట ఎస్సై సంజీవరెడ్డి, బాలవీరయ్య అండ్ సన్స్, హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ సభ్యులు హాజరై మాట్లాడారు. పరీక్షల సమయంలో ఒత్తిడిని అధిగమిస్తే విజయం సాధించవచ్చన్నారు. ఉన్నత చదువులతోనే సమాజంలో గుర్తింపు వస్తుందన్నారు. పాఠశాలకు చెందిన 300 విద్యార్థులకు ప్రతీరోజు ఉదయం అల్పాహారం (బ్రేక్‌ఫాస్ట్) అందిస్తోన్న బాలవీరయ్య అండ్ సన్స్ వట్టిం మహేష్, రమేష్, వట్టిం కరుణను ఈ సందర్భంగా సన్మానించారు.

నిధుల మంజూరుకు వినతి

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్‌లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి శనివారం జోనల్ కమిషనర్ వెంకన్నను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేట్ మాట్లాడుతూ.. యాకత్‌పురా నియోజకవర్గం పరిధిలో అత్యధికంగా పన్నులు చెల్లించేవారు ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలో ఉంటారని అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడంలో అధికారులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారన్నారు. గత 18 నెలలుగా డివిజన్‌కు ఎలాంటి నిధులు కేటాయించలేదని ఉన్నతాధికారులు స్పందించి నిధుల మంజూరు చొరవ చూపాలన్నారు.



వినతిపత్రం ఇస్తున్న శ్వేతామధుకర్‌రెడ్డి

ఉచిత యోగా శిక్షణ తరగతులు

హుడాకాంప్లెక్స్: నేచర్ క్యూర్ విధానంలో యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు శ్రీ షిర్డీ సాయి అష్టాంగ యోగా శిక్షణ కేంద్రం గురూజీ ఇస్మాయిల్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 9 నుంచి 18 వరకు కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయ సమీపంలోని లోటస్ ల్యాప్ ప్లే స్కూల్ గ్రౌండ్‌లో ఉదయం, సాయంత్రం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యాయామాలు, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు, ధ్యానం, ఆసనాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. తరగతులకు హాజరైన ధ్యానులకు అమృత ఆహారం అందిస్తామని చెప్పారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9603256572, 8121410911 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

నాంపల్లి: అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు నాయకత్వంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి పుట్టిన రోజు వేడుకలను శనివారం మాసబ్‌ట్యాంక్‌లోని నఫీజ్ రెసిడెన్సీలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దివ్యాంగులకు నిత్యావసర సరుకులను కేవీ రమణాచారి చేతుల మీదుగా అందజేశారు. సమాజంలో అభాగ్యులకు అండగా నిలిచి సమాజ సేవకు అంకితం కావాలని రమణాచారి యువతకు పిలుపునిచ్చారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



శ్రీనివాస్

హస్తినాపురం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్ యాప్‌లలో పెట్టుబడి పెట్టి మోసపోవద్దన్నారు. యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలు విక్రయించినా, వినియోగించిన నేరమన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

హస్తినాపురం: డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. శనివారం ఆమె డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో పర్యటించి కాలనీల వాసులతో మాట్లాడారు. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లోని ప్రజలకు కనీస వసతులైన మంచినీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధిదీపాల ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మమతా మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

చాదర్‌ఘాట్: వేసవి నేపథ్యంలో మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. మిర్చి సీజన్ కావటంతో ఘాటు వస్తోందని దీంతో చలివేంద్రాలు ఏర్పాటు చేసేలా చొరవ చూపాలన్నారు. అలాగే మార్కెట్ ప్రాంగణంలో నిరుపయోగంగా ఉన్న రైతుల విశ్రాంతి గదులను ఉపయోగంలోకి తీసుకురావాలని రైతులు కోరారు. లక్షలు వెచ్చించి రైతుల కోసం నిర్మించి విశ్రాంతి గదులు నిరుపయోగంగా మారాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్ర సాంబమూర్తి సేవలు మరువలేనివి

వనస్థలిపురం: నాటకాలు, రంగస్థల కళాకారుల కోసం దర్శక విశారద ఆంధ్ర సాంబమూర్తి చేసిన సేవలు ఎనలేనివని పలువురు వక్తలు కొనియాడారు. వనస్థలిపురం భక్త సమాజం ఆధ్వర్యంలో ఆంధ్ర సాంబమూర్తి జయంతిని శుక్రవారం రాత్రి ఎన్జీవోస్‌కాలనీలోని శ్రీ గణేష్ దేవాలయం ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులను సత్కరించారు. అనంతరం నిజాంపేట రామకృష్ణ నాట్యమండలి ప్రదర్శించిన భక్త చింతామణి, విజయవాడ బృందం వారు ప్రదర్శించిన దామోదర నీతి బోధ ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, కృష్ణమూర్తి, ఎం.ఎస్.కే.ప్రభు, గోపాల్‌రావు, హనుమంతరావు, సోమయాజులు, ఉదయ్‌కుమార్, సీహెచ్‌వీఆర్‌కే.మూర్తి, సూర్యప్రకాష్, డా.అప్పారావు, శ్రవణ్ కుమార్, శేషాచలపతి, కామేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా భీష్మ ఏకాదశి వేడుకలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

మన్సూరాబాద్: డివిజన్ పరిధి ఆదిత్యానగర్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం భీష్మ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, సుదర్శన హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్ పర్సన్ సంతోషికుమారి, మోహన్‌రెడ్డి, రవికుమార్, కృష్ణమూర్తి, జీకే గుప్తా, అర్చకులు కొండలాచార్యులు, వీరస్వామిచార్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

అబిడ్స్: సైబర్ నేరాలపై గుడిమల్కాపూర్ పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. జాంసింగ్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శనివారం సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలు వాడితే నష్టాలపై, వాటి దుష్ప్రభావాలపై విద్యార్థులకు వివరించారు. ఇన్‌స్పెక్టర్ బి.రాజు మాట్లాడుతూ..ప్రస్తుత ఆధునిక టెక్నాలజీలో కొంత మంది మాయగాలు సైబర్ నేరాలకు పాల్పడుతూ అమాయకులను ఇబ్బందులపాలు చేస్తున్నారన్నారు. ప్రతి అంశంపై విద్యార్థులకు చిన్నపటి నుంచే అవగాహన ఎంతో అవసరమన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తరచూ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

కాలనీల్లోని శ్మశాన వాటికలను తరలిస్తాం



స్థానికులతో మాట్లాడుతున్న హేమంత్ కేశవ్‌పాటిల్

మన్సూరాబాద్: కాలనీల నడుమ ఉన్న శ్మశానవాటికలను మరో ప్రాంతానికి తరలించేందుకు సహకరం అందిస్తానని ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్ అన్నారు. కాలనీలో అనధికారింగా ఉన్న శ్మశానవాటికలు, కోర్టు కేసుల్లో ఉన్న పార్కు స్థలాలను కాపాడాలని కోరుతూ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీనిలో భాగంగానే ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్ శనివారం నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రయాదవ్‌తో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా కోర్టు కేసుల్లో ఉన్న పార్కులను పరిశీలించానని, కోర్టులో జీహెచ్‌ఎంసీ పక్షాన ఆధారాలు అందజేసి పార్కు స్థలాలను రక్షించి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్ జోనల్ సిటీప్లానర్ శ్రీనివాస్‌యాదవ్, హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, ఇంజినీరింగ్ డీఈ కనకయ్య, ఏఈ దీపక్, టౌన్ ప్లానింగ్ అధికారి అక్బర్, కాలనీవాసులు రాంరెడ్డి, మాధవరెడ్డి, వినోద్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, మణిపాల్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై మధుయాష్కీగౌడ్ విమర్శలు తగవు

వనస్థలిపురం: టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని, ఇది తగదని బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్, ఉపాధ్యక్షుడు ఆనంద్‌రాజ్ అన్నారు. శనివారం వనస్థలిపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. హుడా చైర్మన్, రెండు సార్లు ఎమ్మెల్యేగా ఎల్‌బీనగర్‌లో సుధీర్‌రెడ్డి చేసిన అభివృద్ధి మధుయాష్కీకి కనబడడం లేదని, ఆరు నెలలకు ఓసారి నియోజకవర్గంలో ఆయన పర్యటిస్తూ ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. సుధీర్‌రెడ్డి, ఆయన అనుచరులు అవినీతికి పాల్పడితే దాన్ని నిరూపించాలని ఈ విషయమై ఎల్‌బీనగర్‌లో బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. ఏసీపీ, సీఐల బదిలీలు, భవన నిర్మాణదారుల వద్ద అవినీతికి పాల్పడేది కాంగ్రెస్ పార్టీ నాయకులేనని ఆరోపించారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బీఎన్‌రెడ్డినగర్‌లో బీజేపీ సంబురాలు



స్వీట్లు తినిపిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్ : ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశం అభివృద్ధిలో దూసుకెళ్తుందని అందుకే ఢిల్లీ ప్రజలు బీజేపీకే పట్టం కట్టారని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన నేపథ్యంలో శనివారం ఎస్‌కేడీ నగర్ చౌరస్తాలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్శితులై బీజేపీకి మద్దతు తెలుపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నవకిశోర్‌రెడ్డి, శంకరయ్యగౌడ్, సుధాకర్‌రెడ్డి, శ్రీధర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, నందకిశోర్, రవిశంకర్, మహేశ్‌గౌడ్, చందు, చిన్నయాదవ్, రామ్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, కాంతారావు, మహేందర్‌రెడ్డి, దుర్గారావు పాల్గొన్నారు.

జాతర పోస్టర్ ఆవిష్కరణ

పహాడీషరీఫ్: జల్‌పల్లి గరిగుట్ట పెద్దమ్మ జాతర ఉత్సవాల వాల్ పోస్టర్‌ను శనివారం మాజీ కౌన్సిలర్ యాదగిరి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఉత్సవాలకు రూ.3 లక్షలు మంజూరు చేసినట్లు యాదగిరి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి, మన్నె రవికుమార్, నర్సింహ, యూసుఫ్ ఖాద్రీ, ముక్రం అలీ, కిశోర్, దిలీప్ గౌడ్, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కేఎల్లార్ తదితరులు

శ్మశానవాటికలో అన్ని వసతులు కల్పిస్తాం



శ్మశానవాటిక కమాన్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రజిత

ఉప్పల్: మున్నూరు కాపు, రెడ్డి కులస్తుల శ్మశానవాటికను మరింత అభివృద్ధి చేయనున్నట్లు స్థానిక కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఉప్పల్‌కు చెందిన నాయబు వేంకటేశ్వర్లు ఆయన తండ్రి హనుమంతు జ్ఞాపకార్థం నిర్మించిన శ్మశానవాటిక కమాన్‌ను స్థానికులు, సంఘం పెద్దలతో కలిసి ప్రారంభించారు. శ్మశాన వాటిక అభివృద్ధికి తొలి విడతగా రూ. కోటి ఐదు లక్షలు, రెండో విడతగా రూ. 45 లక్షల నిధులను మంజూరు చేయించినందుకు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మేకల మధుసూదన్‌రెడ్డి, దుబ్బ నర్సింహ్మారెడ్డి, శామీర్‌పేట ధర్మారెడ్డి, మేకల హనుమంతురెడ్డి, నాయబు లక్ష్మమ్మ, నాగిరెడ్డి, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మీ బస్తీకే దవాఖానాలు

ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: ఖరీదైన వైద్యం ఎలా అని చింత చెందకుండా.. మీకు ఉచితంగా సకాలంలో వైద్యం అందించేందుకు బస్తీ దవాఖానలు అందుబాటులోకి తెచ్చామని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. ప్రజలు ఆస్పత్రిని వినియోగించుకోవాలని సూచించారు. శనివారం బడంగ్‌పేట కార్పొరేషన్ అల్మాస్‌గూడ 25వ డివిజన్‌లో బస్తీ దవాఖానను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. నిరుపేదలకు జబ్బు చేస్తే వైద్య ఖర్చులు భరించలేని స్థితిలో ఉన్నారని, అందరు ఆరోగ్యంగా ఉండాలనే ఈ దవాఖానలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో బస్తీ దవాఖానలు, 8 అర్బన్ హెల్త్ సెంటర్లు తీసుకువచ్చామని పేర్కొన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వర్, బస్తీ దవాఖాన జిల్లా ఇన్‌చార్జి వినోద్‌కుమార్, డాక్టర్ గీత, బాలాపూర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాలమణి, మాజీ కార్పొరేటర్ ముత్యాల లలిత, డాక్టర్ గాయత్రి, డాక్టర్ అఖిల, డీపీఎంఓ అక్రమ్, బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, ఏనుగు రాంరెడ్డి ఇతరులు పాల్గొన్నారు.



దవాఖానా ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సబితారెడ్డి

పోటాపోటీగా చెస్ పోటీలు

చార్మినార్: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో డాక్టర్ మన్‌మోహన్ సింగ్ మెమోరియల్ స్కూల్ చెస్ టోర్నమెంట్–2025 పోటాపోటీగా జరిగాయి. మొఘల్‌పురాలోని ఉర్దూ ఘర్‌లో శనివారం ఈ పోటీలు తొమ్మిది రౌండ్లలో స్విస్ ఫార్మేట్‌లో జరిగాయి. 120 మంది విద్యార్థులు 60 జోడీలుగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలను సుల్తాన్–ఉల్–ఉలూం ప్రిన్సిపాల్ రహీమా బేగం ప్రారంభించి విద్యార్థుల ఆట తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...విద్యాభ్యాసంతో పాటు చెస్ లాంటి క్రీడలు విద్యార్థులకు ఎంతో అవసరమన్నారు. హుస్సేనీ ఆలం, టప్పా చబుత్రా, బాబానగర్, గోల్కొండ, మహేంద్రాహిల్స్, మలక్‌పేట్, చార్మినార్, సికింద్రాబాద్, మెహదీపట్నం, బేగంపేట్, సనత్‌నగర్ తదితర ప్రాంతాలలోని పలు ప్రైవేట్ స్కూళ్లకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు.

